# భూమి కోసం



సంచిక : 7 సెప్టెంబరు - 2009

**ఈ సంచికలో ముఖ్యంగా మూడు అంశాలకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. పేదలకు ప్రభుత్వ భూముల సాధన, వారికిచ్చిన అసైన్డ్ భూముల పరిరక్షణ, గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి 100 రోజులకు తక్కువకాకుండా పని కల్పించే జాతీయ ఉపాధి హామీ చట్టం, గత ఐదు సంవత్సరాలుగా అమలులో ఉన్న అసైన్డ్ భూముల అభివృద్ధికి ఉద్దేశించిన సమగ్ర భూమి అభివృద్ధి పథకం(ఇందిర ప్రభ). వీటిని సాధించుకోవాలంటే ప్రజా సమీకరణతో పాటు కొన్ని పాలన పద్ధతులపై మనం పట్టు సాధించాలి. ఈ సాధనలో సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకునే నైపుణ్యం ఒక అంతర్భాగం. దానికి సంబంధించి ఈ సంచికలో కొన్ని అంశాలను వివరించాం. వచ్చే సంచికల్లో విద్య, వైద్య అవకాశాలు, అంగన్‌వాడీ, ఆహార చట్టం వంటి సంక్షేమ పథకాలు, పంచాయితీ వ్యవస్థ మొదలగు రాజకీయ అంశాలతో పాటు, భూముల సాధనకు సంబంధించిన ఇతర అంశాలు ఉంటాయి.**

## పేదల భూమి-ఉపాధి హక్కుల సాధనకు తోడ్పడదాం!

ప్రస్తుతం అమలులో ఉన్న రాజకీయ, ఆర్థిక విధానాల వల్ల గ్రామాల్లో పేదలు తమకున్న భూమి, ఉపాధి అవకాశాలు కోల్పోవడాన్ని చూస్తున్నాం. వ్యవసాయ కూలీలకు, భూమి లేని పేదలకు సాగుయోగ్యమైన భూమిని కల్పించాలనే భూ సంస్కరణల లక్ష్యం ప్రక్కకు పోయి, ప్రస్తుతం ఉన్న భూములను కాపాడుకోవటమే పేదలకు తలకు మించిన పని అవుతోంది. భూములు, వనరులు, వృత్తులు చేజారుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి సమస్య కూడా తీవ్రమవుతోంది. అలాగే పేదలకు ముఖ్యంగా దళిత, ఆదివాసీ వర్గాలకు ప్రస్తుత పాలనా విధానాల వల్ల సరైన విద్య, వైద్య అవకాశాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఈ కారణంగా ఆయా వర్గాలలో మానవవనరుల అభివృద్ధి కుంటుపడుతోంది. ఇవన్నీ కలసి పేదలను మరింత పేదలుగా మారుస్తున్నాయి. తమ కనీస జీవనాధారానికి వారు ఆధిపత్య కులాలు, వర్గాలపై మరింత ఆధారపడేటట్లు చేస్తున్నాయి.

ఇదే క్రమంలో సామాజికంగా, రాజకీయంగా మరింత బలహీన మవ్వటంతో స్థానిక సంస్థల పరిపాలనలో భాగస్వామ్యం, నిర్ణయాధికారం కోల్పోతున్నారు. తమ అవసరాలకు అనుగుణంగా పథకాలు, హక్కులు కల్పించుకునే చేసుకునే స్థితిలో ఎలాగూ లేరు. అసమగ్రంగానైనా ప్రస్తుతం ఉన్న అనేక పథకాల (భూమి అభివృద్ధి, ఇందిరమ్మ ఇల్లు, రేషను బియ్యం, ఉపాధి హామీ, పించను, పంట భీమా, పంటకు గిట్టుబాటు ధర, బ్యాంకు రుణాలు వగైరా) ఫలాలను, హక్కులను కూడా సమర్థవంతంగా అందు కోలేకపోతున్నారు. పేదల పేరు మీద అమలయ్యే పథకాలు, అందుకు ఖర్చు అయ్యే నిధులలో ఎక్కువ శాతం పెద్దల చేతుల్లోకి పోతున్నాయి. విద్య, వైద్యానికి సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో పాటు ప్రజలకు నిజంగా మేలు చేకూర్చే ప్రత్యామ్నాయాలను విస్తృత చర్చకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో పేదలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు పనిచేస్తున్న సంఘాలు,

కార్యకర్తలు, గ్రామ స్థాయి సంఘాల నాయకులు రెండు అంచెలలో పనిచేయాల్సిన అవసరం ఉంది.

✤ ఒకటి ప్రస్తుతం ఉన్న వివిధ పథకాలు, చట్టాలు, నిబంధనల పై ప్రజలలో అవగాహన కల్పించటం, వాటిలో పేదలకు ఉపయోగపడేవాటిని సాధించు కోవటానికి సంఘటితపరచడం, సహకరించడం. ఉపయోగపడని, నష్టం కలిగించే, మభ్యపట్టే వాటిలోని లోపాలను ప్రజలలోకి తీసుకువెళ్లి వాటిలో మార్పులు సాధించడం. ఇది స్వల్పకాలిక లక్ష్యం.

✤ రెండవది - పేదలను సంఘటితం చేయడంద్వారా వారి రాజకీయ అవగాహనను, శక్తిని పెంపొందించి వారి బతుకుతెరువుకు అవసరమైన వనరులు/ఆస్తులపై పట్టు సాధించుకునే దిశగా, వారి అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయంతీసుకోగలిగే అవగాహనను, అవకాశాన్ని సాధించుకునే దిశగా తోడ్పడటం. ఇది దీర్ఘకాలిక లక్ష్యం.

గ్రామ, మండల స్థాయి ప్రజా సంఘాలలో, వివిధ సంఘాల కార్యకర్తలలో ఈ అవగాహన పెంపొందించడానికి, పథకాలు, హక్కుల సాధనకు కావలసిన సమాచారాన్ని, విషయ పరిజ్ఞానాన్ని అందించడానికి ఈ సంవత్సరం 'భూమి కోసం' సంచికలను మీ ముందుకు తీసుకొస్తున్నాం. కార్యకర్తలు ఈ అంశాలను, వివరాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లటంతో పాటు, వారిని సంఘటితపరచిపై హక్కులను, పథకాలను వారే సాధించు కునే దిశగా వారిలో సామర్థ్యాన్ని, నాయకత్వాన్ని పెంపొందించగలరని ఆశిస్తున్నాం. ❑

# ప్రభుత్వ భూములు సాధించడంలో వచ్చే సమస్యలు, పరిష్కారాలు

**పి.ఎస్. అజయ్‌కుమార్**

ఏ గ్రామానికి వెళ్ళినా పట్టా లేకుండా ప్రభుత్వ భూమి సాగు చేస్తున్న వారు మనకి ఎవరో ఒకరు కనిపిస్తారు. వారిలో ఎక్కువగా పేదవాళ్లే ఉంటారు. పట్టా కాగితం భద్రతను కల్పిస్తుంది. భూమిపై హక్కు ఏర్పడినప్పుడే ఋణ సౌకర్యం (అప్పు), పరపతి లభిస్తాయి. అందుచేత సాగు చేస్తున్న భూమికి పట్టా సర్టిఫికెట్ తప్పక కావాలి.

మరి ఆ పట్టా ఎలా వస్తుంది? పట్టా కోసం మనం ఏం చెయ్యాలి? ఈ ప్రశ్నలకు జవాబు కావాలంటే ముందుగా మనం రెండు విషయాల పట్ల ప్రాథమిక అవగాహన ఏర్పరచుకోవాలి. అవి: **భూములు, పట్టాలు** -వాటి రకాలు. వీటిని తెలుసుకుందాం.

**భూములు రకాలు**

1) ప్రైవేటు లేదా జిరాయితీ భూములు 2) ప్రభుత్వ భూములు

ఇనాం, దేవుడు భూములు కూడా విస్తృతార్థంలో మొదటి రకానికే చెందుతాయి. భూముల రకాలు చూశాం. ఇప్పుడు పట్టాలలో రకాలు చూద్దాం.

**1) జిరాయితీ లేదా సెటిల్‌మెంట్ పట్టాలు, 2) ప్రభుత్వ భూములకు ఇచ్చే పట్టాలు**

రెండవ రకం పట్టాలనే ఆంధ్రాలో డి-ఫారం పట్టా, రాయలసీమలో డికెటి పట్టా, తెలంగాణాలో లావణీ పట్టా అని పిలుస్తారు. పేరు ఏదైనా సారాంశం ఒకటే. ప్రభుత్వ బంజరు భూమికిగాను పేదలకు ఇచ్చే పట్టా ఇది. ప్రస్తుతం మన చర్చను పైన ప్రస్తావించిన డి పట్టాకే పరిమితం చేద్దాం.

**డి పట్టా ఎవరికిస్తారు?**

'ప్రభుత్వ బంజరు భూమి' అని మనం అంటున్న భూమి రెండు రకాలుగా వుంటుందని ఈ సందర్భంలో గుర్తు పెట్టుకోవాలి. అవి: **శిస్తు (లేదా తరం) నిర్ణయించిన ప్రభుత్వ బంజరు, పోరంబోకు భూమి.** ఒక గ్రామంలో ప్రజలందరి అవసరాలకు ఉపకరించే కాలువ, చెరువు, స్మశానం, దారి, వంక, వాగు వంటివన్నీ పోరంబోకు కేటగిరికి చెందుతాయి. వాటికి పట్టాలు ఇచ్చే అధికారం తహశీల్దారుకు లేదు. **శిస్తు నిర్ణయించిన బంజరు భూములకు మాత్రమే తహశీల్దారు పట్టా ఇవ్వగలరు.**

తెలంగాణా ప్రాంతంలో ప్రభుత్వ భూముల వర్గీకరణ, పేర్లలో కొద్దిగ తేడాలు వుంటాయి. ఏదైనా ఒక పోరంబోకు భూమికి తహశీల్దారు పట్టా ఇవ్వాలంటే ముందుగా ఆ భూమిని శిస్తు నిర్ణయించిన బంజరుగా మార్చవలసి వుంటుంది. అయితే అలా మార్చే అధికారం ఆయనకు లేదు. ఇందుకు తహశీల్దారు పై అధికారైన ఆర్‌డిఓ (రెవెన్యూ డివిజనల్ అధికారి) అనుమతి అవసరం.



**డి పట్టా కోసం ఏం చెయ్యాలి?**

సాగులో వున్న ప్రభుత్వ బంజరు భూమికి పట్టా కావాలంటే ముందుగా తహశీల్దారుకు ధరఖాస్తు చేయాలి. మీరు ధరఖాస్తు చేయడానికి ముందు ఈ కింది సమాచారం మీ దగ్గర వుండటం అవసరం.

* పట్టా అడుగుతున్న భూమి, ఏ రెవెన్యూ గ్రామానికి చెందుతుంది ?
* ఆ భూమి సర్వే నెంబరు ఏమిటి ?
* ఇది శిస్తు నిర్ణయించిన బంజరు భూమా లేక పోరంబోకు భూమా?

ఈ సమాచారం లేకపోతే దరఖాస్తు చేయకూడదని ఏమీ లేదు. కానీ ముందస్తు సమాచారం వుంటే మీకు స్పష్టత వస్తుంది.

**భూమి కోసం దరఖాస్తు:**

ఒక తెల్ల కాగితంపై రాసి అర్జిదారు సంతకం పెట్టి ఇవ్వవచ్చు. ఎటువంటి నగదు చెల్లించనవసరం లేదు.

**దరఖాస్తు ఎప్పుడివ్వాలి?**

సంవత్సరంలో ఎప్పుడైనా ఇవ్వవచ్చు.

**మర్చిపోకూడనివి:**

మీరు దరఖాస్తు ఇస్తున్నప్పుడు, ఇచ్చినట్లుగా రశీదు తీసుకోవాలి. దానిపై తేది, అధికారి సంతకం, కార్యాలయం ముద్ర వుండేటట్లు చూసుకోవాలి.

**రశీదు లేదంటే...**

**మీరు రశీదు ఇవ్వమని అడిగితే 'మా వద్ద రశీదులు లేవు' అని చెప్పే అవకాశం వుంది. అందుకే మీ దరఖాస్తును జిరాక్సు చేయండి. జిరాక్సు ప్రతిపై దరఖాస్తు ముట్టినట్లుగా రాసి, సంతకం పెట్టి, కార్యాలయం ముద్ర వేయమని అడగండి.**

***కోనేరు రంగారావు కమిటీ సూచన మేరకు ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం. 44677/ఎసైన్‌మెంట్, పిఐటి(2)/2007-1, తేదీ 24-09)2007 ఉత్తర్వు ప్రకారం ప్రభుత్వ భూమి పట్టా కోసం ధరఖాస్తు చేసిన మూడు నెలలలోగా అర్జీదారు అర్హులవునో కాదో నిర్ణయించి పట్టా మంజూరు చేయడమో, తిరస్కరించడమో చేయాలి. ఆ నిర్ణయాన్ని రాతపూర్వకంగా అర్జీదారుకు అందచేయాలి.***

**గమనించండి:**

మీ దరఖాస్తులో అర్జీదారు అర్హతను ప్రస్తావించాలి, చిరునామా ఇవ్వాలి. భూమికి సంబంధించిన వివరాలు అనగా సర్వే నెంబరు, విస్తీర్ణం, హద్దులు ఇస్తే ఇంకా మంచిది. పేదవారికి మాత్రమే డిపట్టా ఇస్తారు. పేదవాడంటే 2.50సె॥ పల్ల (తరి), 5.00 మెట్ట (కుష్కి) మించకుండా వుండాలి. వ్యవసాయంపై ఆధారపడి స్థానికంగా జీవిస్తుండాలి.

**పోరంబోకు భూమికి పట్టా**

ప్రభుత్వ బంజరు భూములలో శిస్తు నిర్ణయించిన బంజరు భూమికి మాత్రమే ఎమ్మార్వో/తహశీల్దారు పట్టా ఇవ్వగలడని తెలుసుకున్నాం. సాగులో వున్న పోరంబోకు భూమికి పట్టా ఎలా వస్తుంది?

**పోరంబోకు**

ప్రజల ఉమ్మడి అవసరాలకు ఉపకరించే భూములనే పోరంబోకు భూములంటారని ముందు చెప్పుకున్నాం. ఈ **పోరంబోకు భూములలో మరలా రెండు రకాలు ఉన్నాయి.**

* ఎవరూ ఆక్రమించకూడని పోరంబోకు భూములు. వీటిని ఎవరైనా ఆక్రమణ చేస్తే వాటిని అభ్యంతరకరమైన ఆక్రమణగా గుర్తించి వెంటనే తొలగించాలి. ఉదా: స్మశానం, చెరువు, దారి వగైరా. వీటిని ఆక్రమిస్తే ప్రజలకు అసౌకర్యం కలుగుతుంది.
* రెండవ రకం అభ్యంతరకరం కాని ఆక్రమణలు ఉదా: కొండ పోరంబోకు, మేత పోరంబోకు వగైరా

**పట్టా వస్తుందా?**

మీరు దరఖాస్తు చేసిన భూమి అభ్యంతరకరంకాని పోరంబోకు భూమి అయితే దానికి పట్టా వచ్చే అవకాశం వుంది. ఇటువంటి భూములనే శిస్తు నిర్ణయించని లేదా తరం కట్టని బంజరు అంటారు. అయితే ముందుగా దాని వర్గీకరణ మారాలి.

**వర్గీకరణ మార్పు**

ప్రభుత్వ బంజరు భూములలో శిస్తు నిర్ణయించిన బంజరు భూమికి మాత్రమే తహశీల్దారు పట్టా ఇవ్వగలడని ముందుగా తెలుసుకున్నాం. అభ్యంతరకరం కాని పోరంబోకు భూమికి తహశీల్దారు పట్టా ఇవ్వాలంటే ముందుగా ఆ భూమిని




శిస్తు నిర్ణయించిన బంజరుగా మార్చాలి.

పట్టా ఇవ్వదలుచుకున్న భూమికి ఎంత శిస్తు వసూలు చేయవచ్చునో ఒక ప్రతిపాదనను తహశీల్దారు తయారు చేసి ఆర్‌డిఓకు పంపిస్తారు. ఆర్‌డిఓ ఆమోదిస్తే అప్పుడు ఆ భూమి శిస్తు నిర్ణయించిన భూమి అవుతుంది. అప్పుడు తహశీల్దారు పట్టా ఇవ్వగలుగుతారు.

**మరి మిగిలిన వాటి సంగతి**

వాగు, కాలువ, నది, చెరువు, స్మశానం, దారి ఇలాంటి పోరంబోకు భూములకు పట్టా వచ్చే అవకాశం లేదు.

**డి పట్టా ఎలా తయారవుతుంది:**

పట్టా కావాలని మనం దరఖాస్తు చేసుకున్న దగ్గర నుండి మన చేతికి పట్టా వచ్చే మధ్యలో తహశీల్దారు కార్యాలయంలో ఏం జరుగుతుందో తెలుసుకుందాం.

**1. పట్టా కోసం దరఖాస్తు**

**2. ఎ1 నోటీసు వేలాడదీయడం**

ఏ గ్రామంలో భూమి కోసం దరఖాస్తు చేసారో ఆ గ్రామంలో పదిమంది చేరేచోట అతికించే నోటీసు ఇది. ఇందులో దరఖాస్తు చేసిన వ్యక్తి వివరాలు, భూమి వివరాలు వుంటాయి. ఎవరికైనా అభ్యంతరం వుంటే 15 రోజులలోగా ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసుకోవచ్చు.

**3. దండోరా రిపోర్టు**

ఫలాన వ్యక్తి ఫలాన సర్వే నెంబరు భూమికి పట్టాకోసం దరఖాస్తు చేసుకున్నాడనీ, అభ్యంతరాలు వుంటే చెప్పుకోవచ్చుని దండోరా వేయించాలి. దండోరా వేసినట్లు రిపోర్టు తయారు చేయాలి. ఇద్దరు పెద్ద మనుషుల సాక్షి సంతకాలు వుండాలి. దండోరా వేసిన వ్యక్తి వివరాలు పేర్కొనాలి.

**ఫారం -1**

దరఖాస్తుదారుని అర్హత, దరఖాస్తు చేసిన భూమికి సంబంధించిన అంశాలపై గ్రామ రెవెన్యూ కార్యదర్శి విచారణ చేసి రూపొందించే నివేదిక ఇది.

**ఎ-మెమోరాండం**

డి పట్టాలు మంజూరు చేసేందుకుగల నియమాలను బోర్డు స్టాండింగ్ ఆర్డర్సు -15 (బిఎస్ఓ -15) అంటారు. ఈ నియమాలను అనుసరించి అన్ని అంశాలు సక్రమంగా వున్నదీ లేనిదీ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు విచారించి నివేదిక ఇస్తారు.

**సబ్ డివిజన్ వర్కు**

పట్టా ఇవ్వదలుచుకున్న భూమిని సర్వే చేసి, సర్వే, భూమి రికార్డులలో తగు మార్పులను మండల సర్వేయరు సిద్ధం చేస్తారు. ముఖ్యంగా పొలం కొలతల పటం, పట్టా విస్తీర్ణాన్ని ఎర్రసిరాతో నమోదు చేస్తారు.

**స్క్రూటినీ (తనిఖీ)**

మండల సర్వేయరు సిద్ధం చేసిన పొలం కొలతల పటాన్ని సంబంధిత ఆర్‌డిఓ ఆఫీసులో గల డిఐఓఎస్ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే) పరిశీలించి సరిగ్గా ఉన్నదీ లేనిదీ నిర్ధారిస్తారు.

**రికార్డులలో మార్పులు**

గ్రామ రికార్డులు, సెటిల్‌మెంట్ భూమి రికార్డులలో తగిన మార్పులు చేయమని తహశీల్దారు సర్వేయరును ఆదేశిస్తారు. సర్వేయరు ఎర్రసిరాతో మార్పులు చేస్తారు.

**కోనేరు రంగారావు కమిటీ సిఫార్సును అనుసరించి, భూపరిపాలనా ప్రధాన కార్యదర్శి డి-పట్టాలు ఇవ్వడానికి సంబంధించి ఈ కింది వివరాలతో 6-10-2007 నాడు ఉత్తర్వులు(బి1/2127/2007) జారీ చేశారు.**

- ★ **ప్రభుత్వ భూములపై పట్టాలు ఇవ్వడానికి గ్రామ రెవెన్యూ అధికారి దండోరా చేయించి, ఆ గ్రామంలోని వయోజనులందరూ పాల్గొనేలా సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించాలి.**
- ★ అందులో గ్రామంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు, గ్రామంలోని నిరుపేదల జాబితా చదివి వినిపించి, గ్రామసభ ద్వారా అర్హులను ఎంపికచేయాలి.
- ★ గ్రామసభలో జరిగిన చర్చలను, తీర్మానాలను నమోదు చేసి పాల్గొన్న వారి పేర్లు, సంతకాలు తీసుకోవాలి.
- ★ గ్రామసభలో ప్రతిపాదించిన అర్హుల పేర్లను గ్రామ చావిడి, పంచాయితీ కార్యాలయం, పాఠశాల వంటి ప్రదేశాలలో అంటించాలి.

**4. పట్టా సిద్ధం**

డి-ఫారం పట్టా ఇచ్చే ప్రొఫార్మాను రెండు కాపీలు సిద్ధం చేసి దరఖాస్తు నుండి ఈ పట్టా కాపీ వరకు వున్న రికార్డును ఒక ఫైలుగా తయారు చేస్తారు

**5. పట్టా మంజూరు**

పట్టా ఇచ్చే ప్రతిపాదనలను ఎసైన్‌మెంటు కమిటీ ముందు పెడతారు. కమిటీ సభ్యులందరూ ఆమోదిస్తే పట్టా సర్టిఫికెట్‌ను దరఖాస్తుదారుకిస్తారు.

ఇదీ ఒక డి-పట్టా పుట్టేందుకు జరిగే తంతు.

**డిమాండు: మండలంలోని ప్రతి గ్రామంలో పేదల అనుభంలో ఉన్న ప్రభుత్వ భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలి. అందుకు ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేయాలి.**

## డి పట్టా అన్యాక్రాంతం అయితే...??

ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూమిని పట్టాదారు, అతని/ ఆమె వారసులు తప్ప ఇతరులు అనుభవించరాదు. అలా చేయడం ఆంధ్రప్రదేశ్ ఎసైన్‌మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టం, 1977 ప్రకారం నేరం.

**అన్యాక్రాంతం**

ఒకరికి ఇచ్చిన డిపట్టా భూమిని మరొకరు అనుభవించడాన్ని అన్యాక్రాంతం అంటున్నాం. అన్యాక్రాంతం అనే మాటకు చట్టంలో విస్తృతార్థం వుంది. అమ్మకం, కౌలు, తనఖా, కానుక, మార్పిడి - ఏది చేసినా అన్యాక్రాంతమే, చట్ట ప్రకారం నేరమే.

**ఏం చెయ్యాలి?**

ఒక డి-ఫారం పట్టా భూమి అన్యాక్రాంతం అయితే ముందుగా ఆ వివరాలతో ఒక ఫిర్యాదును తయారు చేసి ఎమ్మార్వోకు ఇచ్చి రశీదు తీసుకోవాలి. ఫిర్యాదులో మనం ఈ కింది విషయాలను ప్రస్తావించడం అవసరం.

1 పట్టా ఎప్పుడు ఎవరికి మంజూరు చేశారు.

2 సర్వే నెంబరు, విస్తీర్ణం, పట్టా మంజూరు చేసిన తేది.

3 అన్యాక్రాంతం పొందిన వ్యక్తి వివరాలు, చిరునామా.

**కలెక్టరుకు నివేదిక:**

తహశీల్దారు ఫిర్యాదును స్వీకరించి ప్రాథమిక విచారణ నిర్వహిస్తారు. తన నివేదికను కలెక్టరుకు పంపిస్తూ 9/77 చట్టం కింద చర్యలు తీసుకోవడానికి అనుమతించమని కోరతారు. కలెక్టరు నుండి ఆదేశాలు రాగానే, భూమిని అన్యాక్రాంతం పొందిన వ్యక్తికి, చేసిన వ్యక్తికి **ఫారం -1 నోటీసు** ఇచ్చి 15 రోజులు గడువు ఇస్తారు. తరువాత భూమిని ఆక్రమణదారు నుండి స్వాధీనం చేసుకుంటారు.




**తిరిగి ఎవరికిస్తారు:**

డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఈ చట్టానికి 2007లో రెండు సవరణలు తీసుకు వచ్చింది. ఈ సవరణలు రాకముందైతే స్వాధీనం చేసుకున్న భూమిని తిరిగి పట్టాదారుకు లేదా అతని వారసులకు ఇస్తారు. ఇప్పుడలా కాదు.

***9/77 చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణల ప్రకారం రాష్ట్రంలో ఏదైన ప్రాంతానికి ఈ చట్టం వర్తించదని ప్రభుత్వం ప్రకటించవచ్చు. అటువంటి ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న భూమిని ప్రభుత్వం తన వద్దనే వుంచుకుంటుంది.***

ఒకవేళ ప్రభుత్వం ప్రకటించని ప్రాంతమైతే, పట్టాదారు లేదా అతని వారసులకు భూమి తిరిగి ఇవ్వాలంటే వారు అప్పటికీ పేదవారై వుండాలి. పేదవారై వుండకపోతే మరో పేద కుటుంబానికి ఇస్తారు. అలాగే ఆ భూమిని ఏ ఉపయోగం కొరకు (ఉదా. వ్యవసాయం) ఇచ్చారో ఇప్పటికీ అదే అవసరానికి ఉపయోగిస్తూ ఉండాలి.

**చట్టం వర్తించని సందర్భం:**

అన్యాక్రాంతం 1977కు ముందు జరిగి, భూమిని పొందిన వ్యక్తి పేదవాడైతే అతనికి ఈ చట్టం నుండి మినహాయింపు లభిస్తుంది

**గుర్తుంచుకోవలసిన అంశాలు:**

- అన్యాక్రాంతం 1977కి ముందు జరిగిందా? జరిగితే భూమి తీసుకున్న వారు పేదలేనా?
- భూమి వున్న గ్రామాన్ని చట్టం అమలు నుండి రాష్ట్ర ప్రభుత్వం మినహాయిస్తూ ప్రకటన ఇచ్చిందా?



★ డి పట్టా భూమిని అన్యాక్రాంతం చేసిన పట్టాదారు లేదా అతని వారసులు ఇప్పటికీ పేదలేనా?

**డిమాండ్లు:**

**1 మండలంలో ప్రతి గ్రామంలో అన్యాక్రాం తమైన భూములను గుర్తించి అన్యాక్రాంతం చేసుకున్న వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలి.**

**2 నిర్దిష్ట కాలవ్యవధిలో ఆ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలి.**

**కోనేరు రంగారావు కమిటీ సిఫారసు(1.11) అనుసరించి రెవెన్యూశాఖ తేదీ 24-3-08 నాడు అన్ని జిల్లా కలెక్టర్లకు 9/77 చట్టం, సవరించిన 8/2007 చట్టం ప్రకారం ఖచ్చితంగా అమలు చేయవలసిందిగా ఆదేశించింది. అలాగే ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషను కార్యాలయంలో ఉన్న అసైన్‌మెంట్, సీలింగు మిగులు భూముల వివరాలను మండల, డివిజన్ రెవెన్యూ కార్యాలయాలలో ఉన్న వివరాలతో సరిపోల్చు కోవాల్సిందిగా ఆదేశించింది. తద్వారా అసైన్‌మెంట్ భూముల అమ్మకాలు, రిజిస్ట్రేషను నివారించవచ్చు.**

### తూర్పుగోదావరి జిల్లా దళిత బహుజన ఫ్రంట్ కార్యకర్త అనుభవం

ప్రత్తిపాడు మండలం నందివంపు గ్రామంలో నలుగురు ఎస్‌సి కుటుంబాలకు సర్వే నెం. 17/5 లో మూడున్నర ఎకరాలకు ప్రభుత్వం దాదాపు 20 ఏళ్ల క్రింద డి-పట్టా మంజూరు చేసింది. అయితే ఆ భూములను సాగులోకి తెచ్చుకునే స్తోమత లేక, కుటుంబ అవసరాల నిమిత్తం ఎకరా 1500 రూపాయలకు ఒక రైతుకు 99 సంవత్సరాలకు లీజుకిచ్చారు. వేరే కులానికి చెందిన ఆ రైతు ఆ భూమిని సాగు చేసుకుని లబ్దిపొందుతూ ఉన్నారు. అసైన్ భూముల వివరాలు తీసుకుని, ఆయా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించే సందర్భంలో ఈ విషయం అక్కడ పనిచేస్తున్న కార్యకర్త పెరుమాళ్ల దేముడు (నల్లన్న) దృష్టికి వచ్చింది. 9/77 చట్టం ప్రకారం డి-పట్టా భూముల అన్యాక్రాంతం ఏ రూపంలోనూ(కొనుగోలు/లీజు) చెల్లదని, ఆ భూములను దళితులు తిరిగి పొందవచ్చు అనే విషయంపై వారికి అవగాహన కలిగించారు. తహశీల్దారుకు, జిల్లా కలెక్టరుకు తమ భూములు తమకు ఇప్పించవలసిందిగా అర్జీలు పెట్టడంలో వారికి తోడ్పడ్డారు. వారినుండి ఎటువంటి చర్య లేకపోవడంతో సంఘం ఇచ్చిన బలంతో ఆ నలుగురు భూముల్లోకి దిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. అయితే రైతు కుటుంబంలోని ఆడవాళ్లు అడ్డుపడ్డారు. ఘర్షణ జరిగి, సమస్య తీవ్రమైన సందర్భంలో దళితులు తమ భూములు తమకు ఇప్పించాలని, 9/77 చట్టం ప్రకారం లీజు చెల్లదని, భూములు అప్పగించకపోతే హై కోర్టును ఆశ్రయించవలసి ఉంటుందని తహశీల్దారుకు స్పష్టం చేయడంతో మరో గత్యంతరం లేక భూములను దళితులకు స్వాధీనం చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో సమస్య స్వభావాన్ని గుర్తించడం, సంబంధిత చట్టంపై బాధితులకు అవగాహన కల్పించడం, వారిని అధికారులను నిలదీసేవిధంగా, ప్రత్యక్ష కార్యాచరణకు దిగేవిధంగా తయారు చేయడం అనేవి ముఖ్యమైన ప్రక్రియలు.

### ప్రభుత్వ అవసరాల కోసం డి-పట్టా భూమి సేకరణ

గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం వివిధ పరిశ్రమలు, సెజ్‌ల పేరుతో పెద్ద ఎత్తున పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములను తిరిగి సేకరిస్తుంది. అయితే ఆ సేకరణకు భూ అధిగ్రహణ చట్టం కాకుండా, భూమి కేటాయించేటప్పుడు ఇచ్చే పట్టా సర్టిఫికెట్టులోని 17 వ నిబంధనను వాడుతోంది.

***నిబంధన - 17 : ప్రాజెక్టు నిర్మాణానికిగాని లేక యేవిధమైన ప్రజోపయోగ పనులకు గానీ అవసరమైతే ఏ విధమైన పరిహారం ఇవ్వకుండానే భూమి స్వాధీనం చేసుకొంటారు. భూమిస్వాధీన పరుచుకొనే పని ప్రజోపయోగమైనదా కాదా అనే విషయంలో ప్రభుత్వం కానీ, వారిచే అధికారమివ్వబడిన అధికారి కానీ యిచ్చేదే తుది నిర్ణయం.***

అయితే ఈ విషయానికి సంబంధించి ప్రభుత్వం 1993లో ఉత్తర్వు నెంబరు 1307 ద్వారా ప్రాజెక్టులు, ఇతర ప్రజా ప్రయోజనాల కోసం అసైన్‌మెంట్ భూమిని సేకరిస్తే, అలాంటి జిరాయితీ భూమి సేకరించేటప్పుడు ఇచ్చే ధరకు సమానమైన

మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియాగా డి-పట్టాదారులకు చెల్లించాలని ఉత్తర్వులిచ్చింది.

అలాగే 2004 లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసైనీలకు జిరాయితీ భూమికి సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పింది. అయితే ప్రభుత్వం ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంది. పై ఉత్తర్వులు, తీర్పు తర్వాత కూడా ప్రభుత్వం కాలం చెల్లిన 17 వ నిబంధన పేరుతో పేదలకు నోటీసు ఇవ్వడం అన్యాయం. కార్యకర్తలు తాము పనిచేస్తున్న గ్రామాలలో పై ఉత్తర్వుల(జివొ 1307)పై అసైన్డ్ పట్టాదారులలో అవగాహన కల్పించాలి.

**డిమాండ్లు:**

1 **పేదలకు పంచిన అసైన్‌మెంట్ భూములను సేకరించటం మానుకోవాలి.**

2 **అసైన్‌మెంట్ భూముల పరిరక్షణకు సమగ్ర చట్టం తేవాలి.**

3 **అసైన్‌మెంట్ భూముల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి పట్టాదారులు వ్యవసాయదారులుగా నిలదొక్కుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలి.**

*(మిగతాది 15వ పేజీలో...)*

### ఖమ్మం జిల్లా చంద్రుగొండ మండలంలో ఎపివివియు అనుభవం

చంద్రుగొండ గ్రామంలోని సర్వే నెంబరు 24/1 లో మొత్తం 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది ఏజన్సీ ప్రాంతం. అయితే ఈ భూమిలో గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా సాగులో ఉన్నారు. దాదాపు 73 ఎకరాలలో 74 గిరిజన కుటుంబాలు దాదాపు 40 ఏళ్లుగా సాగుచేస్తున్నారు. మిగిలిన 30 ఎకరాలలో గిరిజనేతరులు (ఎస్‌సి, బిసిలు) సాగులో ఉన్నారు. ప్రభుత్వం గిరిజనులకు 2006లో ఒక్కొక్కరికి 1/2 ఎకరా చొప్పున పట్టాలు ఇచ్చింది. సంఘ కార్యకర్త మండల స్థాయిలో సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ భూమి వివరాలు (సర్వే నెం., విస్తీర్ణం, పహానీ నకలు) తీసుకున్నప్పుడు ఆ సర్వే నెంబరులో మొత్తం 130 ఎకరాలు ఉన్నట్లు, అలాగే గిరిజనులతో మాట్లాడినప్పుడు ఒక్కొక్కరు ఎకరా పైగా సాగులో ఉన్నట్లు గుర్తించారు. అంటే ఇచ్చిన పట్టాకి, సాగు పరిస్థితికి పొంతన లేదు. ఈ విషయాన్ని వారితో చర్చించి తమకు మొత్తం 130 ఎకరాలకు పట్టా ఇవ్వవలసిందిగా తహశీల్దారుకు ధరఖాస్తు పెట్టడంలో సహకరించారు. తహశీల్దారు జాప్యం చేయడం, 30 ఎకరాలు అనుభవిస్తున్న గిరిజనేతరులకు



అనుకూలంగా వ్యవహరించడంతో గిరిజనులు భూమిని ఆక్రమించారు. తహశీల్దారు, ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లడం ద్వారా వత్తిడి తీసుకువచ్చారు. తర్వాత ఆర్‌డిఒ ఆదేశాల మేరకు ఇందిరాక్రాంతి పథం సర్వే సిబ్బంది ఆ భూమిని, అనుభవ పరిస్థితిని సర్వే చేసారు. గిరిజనులు వాస్తవంగా అనుభవంలో ఉన్న భూమికి పట్టాలు తయారీ ప్రక్రియ పూర్తయ్యింది. గిరిజనులు కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినా గిరిజనేతరుల (ఎస్‌సి, బిసి) సాగులో ఉన్న 30 ఎకరాలను వారు సాగు చేసుకునేందుకు అంగీకరించారు. వారు కూడా చిన్న సన్న కారు రైతులు కావడం వల్ల దీనికి ఒప్పుకున్నారు.




# ఉపాధి హామీతో ఉపాధి, భూ అభివృద్ధి, సంఘటిత శక్తికి మార్గాలు

టి. సత్యం,పి.ఎస్.అజయ్‌కుమార్, రవి కుమార్

**జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజా సంఘాల కార్యకర్తలు గమనించవలసిన అంశం ఒకటి ఉంది. ఈ పథకం ద్వారా పేదలకు కనీస పని, ఆదాయం మాత్రమే దొరుకుతుంది. వారికి ఎంతోకొంత భూమి ఉంటే అది అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం లభిస్తుంది. ఈ రెంటి ద్వారా వారి బతుకుతెరువు కొంత మెరుగవుతుంది. అయితే కేవలం ఉపాధి హామీ ద్వారానే వారి బతుకులు మారవు. వీలైనంత వరకు వారికి వనరులు ముఖ్యంగా భూమి, ఇతర వృత్తుల వారికి వారి వృత్తులకు తగిన ప్రోత్సాహం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం,ప్రభుత్వం ఖర్చు పెట్టే మొత్తం బడ్జెటులో న్యాయమైన వాటా, మెరుగైన విద్య, వైద్య అవకాశాలు మొదలగునవి సాధించుకున్నప్పుడే వారు దోపిడీకి గురికాకుండా తమ కాళ్ల మీద తాము నిలబడగలుగుతారు. తలెత్తుకుని ఆత్మగౌరవంతో బతక గలుగుతారు. లేకపోతే ఒకరిపై ఆధారపడే కూలీగానే బతకవలసి వస్తుంది. అది పెద్ద రైతులు కావచ్చు, ప్రభుత్వం కావచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకాన్ని పేదలను సంఘటితపరచడానికి, కనీస బతుకుతెరువు సాధించడానికి, ప్రభుత్వ, పరిపాలనా వ్యవహారాలను అర్థం చేసుకోవడానికి సాధనంగా మలుచుకున్నప్పుడే దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించగలుగుతాం.**

**చట్టం లక్ష్యం:**

- ✦ ప్రతి ఆర్థిక సంవత్సరంలో 100 రోజులకు తక్కువ కాకుండా పని కల్పించడం

గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి కుటుంబానికి

నైపుణ్యత అవసరం లేని కూలి పని చేయటానికి ముందుకు వచ్చే వారికి

18 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి

**చట్టం వర్తింపు:**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆగస్టు 23, 2005న పార్లమెంటులో ఆమోదించారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో మొత్తం 22 జిల్లాల్లో ఈ చట్టం అనుసరించి 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - ఆంధ్రప్రదేశ్' ను రూపొందించి అమలు పరుస్తున్నారు.

**రాజీలేని సూత్రాలు:**

- ✦ ఆడ, మగ ఇద్దరికి సమాన కూలి
- ✦ కనీస కూలి (నిర్ణయించిన దాని ప్రకారం - ప్రస్తుతం 100 రూపాయలు)
- ✦ యంత్రాలు, కాంట్రాక్టర్లు ఉండరు
- ✦ వారం లేదా కనీసం 15 రోజులకు వేతనాల చెల్లింపు
- ✦ గ్రామసభలో పనుల ఎంపిక, గ్రామ పంచాయితీ, మండల పరిషత్తుల ద్వారా ఆమోదం
- ✦ పని కోసం దరఖాస్తు ఇచ్చిన 15 రోజుల్లోగా పని కల్పించటం
- ✦ నిర్ణయించిన కనీస కూలి వచ్చేవిధంగా పని కొలతలపై కూలీలకు అవగాహన పెంచడం

**పనిచేసే వాళ్ళ హక్కులు**

- * ఉపాధి హామీ కార్డు పొందిన వారందరికీ పని పొందే హక్కు ( నైపుణ్యం అవసరంలేని పని చేయటానికి ముందుకువచ్చే కుటుంబాలు గ్రామ కార్యదర్శి దగ్గర పేరు నమోదు చేసుకోవాలి. పేరు నమోదు చేసుకున్న వారికి గ్రామ పంచాయితీలు జాబు కార్డులు ఇవ్వాలి.)
- * ఫలానా తేది నుండి (కనీసం 15 రోజుల వ్యవధిలో) పని కావాలని దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకేసారి వందరోజులకు ఒకే దరఖాస్తు చేసుకోవచ్చు, లేదా ఎప్పుడవసరమైతే అప్పుడు పని కావాలని విడతలుగా కోరవచ్చు.
- * దరఖాస్తు చేసుకున్న 15 రోజులలోపు సిబ్బంది పని కల్పించాలి.
- * 15 రోజులలో పని కల్పించలేని సందర్భంలో ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించాలి.
- * మొత్తం 100 రోజులు పనిచేస్తే లభించే డబ్బులకు లోబడి నిరుద్యోగ భృతి చెల్లిస్తారు.
  - అ) మొదటి 30 రోజులకు 25శాతం కూలి.
  - ఆ) మిగిలిన రోజులకు 50 శాతం కూలి.

* దరఖాస్తుదారుల పని పత్రంలో నమోదు అయిన ఇంటికి 5 కిలోమీటర్ల పరిధిలో పని కల్పించాలి. అలా కాకుండా ఎక్కువ దూరంలో పని కల్పిస్తే అదనపు రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల నిమిత్తం కూలి రేటులో 10 శాతం అదనంగా చెల్లించాలి.
* నమోదు చేసుకుని, పని కోరిన కూలీలలో మహిళలు కనీసం 33శాతం ఉండే విధంగా ప్రాధాన్యత నివ్వాలి.
* దళిత వాడలలో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి పనులు కల్పించవచ్చు.

**పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలు**

తాగునీరు, విశ్రాంతి సమయంలో నీడ, పిల్లల సంరక్షణ (6 సంవత్సరాల లోపు పిల్లలు 5 మంది కంటే ఎక్కువ వుంటే), ప్రాథమిక చికిత్స బాక్సు, చికిత్సకు అయ్యే ఖర్చు

**పనుల రకాలు**

1 ఉమ్మడి భూముల్లో, ఎస్.సి, ఎస్.టిలకు చెందిన భూముల్లో, భూ సంస్కరణలు అంటే సీలింగ్ మిగులు భూములు, అసైన్‌మెంట్ భూములు పొందిన లబ్దిదారుల భూముల్లో, చిన్న, సన్న కారు రైతుల భూముల్లో, పొదలు తొలిగించుట, మట్టి/ రాతి కట్టలు, భూమి బలం పెంచే పనులు, మొక్కలు నాటడం మొ.

2 ఎస్.సి, ఎస్.టిలకు చెందిన భూములకు, ఇతర అసైన్డ్ భూములకు సాగునీటి సదుపాయం కల్పించడం

3 చెరువు పునరుద్ధరణ, కాలవలకు మరమ్మతులు, చెరువుల పూడిక తీయడం, ఫీడరు కాలువలు, సాగునీటి కాలువల పూడిక తీయటం, చిన్న తరహా సాగునీటి చెరువుల, కుంటల నిర్మాణం

4 ఎస్.సి, ఎస్‌టి ఆవాసాలలో ప్రాధాన్యతతో అంతర్గత రోడ్లు, డ్రైన్లు మొదలగునవి

5 అటవీ భూముల్లో వన సంరక్షణ సమితిల ద్వారా చెట్లు నాటడం, ఇతర సంరక్షణ పనులు

6 వీటికి అదనంగా ప్రస్తుతం మరిన్ని పనులు, అంటే ఇందిరా ఆవాసయోజన కింద ఎంపికైన లబ్దిదారులకు మరుగుదొడ్లు, ఇంటినిర్మాణంలో కూలీలకు అయ్యే ఖర్చులు, వాటర్‌షెడ్ పథకంలోని పనులు, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా గ్రామాలలో జరిగే పనులను కూడా ఉపాధి హామీలో చేర్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అయితే ఆయా పనులలో మనుషులద్వారా జరిగే పనులకే ఈ పథకం నిధులనుండి చెల్లింపు ఉంటుంది. మిగిలిన నిధులు ఆయా శాఖల నిధుల నుండి భరించాలి.




**ఉపాధి హామీ పథకం అమలులో కొత్తగా చేసిన మార్పులు - ఇతర ఏర్పాట్లు**

40 మంది కూలీలకు ఒకరి చొప్పున ఉన్న పాత మేట్ వ్యవస్థ స్థానంలో కొత్తగా 20 మందికొక పనిచేసే మేట్ (వర్కింగ్ మేట్)ని నియమించే పద్ధతి ప్రవేశపెట్టారు. ఈ మేట్ ఎంతోకొంత చదివి, రాయగలిగి, కనీస లెక్కలు చేయగలిగి ఉండాలి. అలాగే కూలీలో ఒకరిగా, వారితో పాటు పనిచేయాలి. అందుకోసం ఆ మేట్‌కు అతను/ఆమె చేసిన పనికి వచ్చే వేతనానికి అదనంగా రోజుకు 20 రూపాయలు ఇస్తారు.

**వర్కింగ్‌మేట్ బాధ్యతలు:**

* **మేట్ తన గ్రూపులోని ఇతర కూలీలతో కలసి పనిచేయాలి**
* **మస్టర్‌రోల్స్‌ని నిర్వహించడం, కూలీలు ఎంతపని చేయాలన్న మార్కవుట్ ఇవ్వడం మేట్ ప్రధాన బాధ్యత. మారుతున్న రేట్ల ప్రకారం కొలతలు ఎలా మారతాయే మిగిలిన వారికి మేట్ చెప్పాలి**
* **మేట్ తన గ్రూపు కూలీలకు పే స్లిప్పులను ఇప్పించాలి. బ్రాంచి పోస్టుమాస్టరుతో మాట్లాడి పోస్టాఫీసు పనిచేసే సమయంలో పోస్టాఫీసుకు తీసుకువెళ్లాలి. అలాగే స్మార్ట్ కార్డు పై కూడా వేతనాలు ఇప్పించాలి**
* **ఈ వర్కింగ్ మేట్ వ్యవస్థ కొంతవరకు పైన పేర్కొన్న సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించటంలో తోడ్పడవచ్చు. అయితే కార్యకర్తలు మేట్‌లకు అవగాహన ఇవ్వటం, వారి పనితీరును గమనించడంతో పాటు వారు కూలీలకు జవాబుదారీగా ఉండేటట్లు చేయాలి.**

*(ఉపాధి హామీ పథకంకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను పైన తెలుసుకున్నారు. ఇంకా వివరంగా తెలుసుకోవాలనే ఆసక్తిగల వారు భూమి కేంద్రాన్ని సంప్రదిస్తే తెలుగులో ప్రచురితమైన సమాచారాన్ని మీకు పంపగలం).*




## కార్యకర్తలు చేయాల్సిన ప్రయత్నం

ఇప్పుడు గ్రామాలలో మనం ఏం చేయాలో దశలవారీగా చూద్దాం.

### గ్రామ సమావేశం

**మీరు గ్రామానికి వెళ్ళినప్పుడు కూలీలతో సమావేశం అవ్వడం అలవాటు చేసుకోండి. అనువైన స్థలం ఎంపిక చేసుకొని కూలీలను ఒకచోట సమీకరించి సమావేశం జరపటం ప్రజలకు అలవాటు చేయాలి. ఆ సందర్భంగా తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు:**

- దళిత వాడలలో సమావేశ స్థలం వుండేలా చూడాలి. అగ్రకులాల వారి దగ్గర సమవేశం పెట్టి దళితులను రమ్మనకూడదు.
- సమావేశంలో ఎన్ఆర్ఇజిఎస్ గురించి ఏం చెప్పాలో ఏది ముందు, ఏది వెనుకో ముందుగానే ఆలోచించుకోవాలి.
- సమాశంలో మహిళలు పాల్గొనేట్లు చూడాలి.
- చర్చలను ప్రోత్సహించాలి.
- ఎక్కువమంది మాట్లాడేలా చూడాలి.
- చర్చలు, సలహాలు విషయాంశం నుండి పక్కకు పోకుండా జాగ్రత్త వహించాలి.
- ఎన్ఆర్ఇజిఎస్ రాజీలేని సూత్రాలు, కూలీల హక్కులు వివరించేందుకు చార్టులు, బొమ్మలు ఉపయోగిస్తే మంచిది.

### కమిటీల ఏర్పాటు:

గ్రామ ప్రజలతో ముఖ్యంగా కూలీలతో కమిటీలు వేయడానికి ప్రయత్నించండి. ఈ సందర్భంగా ఈ కింద జాగ్రత్తలు తీసుకొండి.

- సాధారణంగా ప్రతి పల్లెలో రెడీమేడ్ నాయకులు వుంటారు. వీరే అందరి తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడతారు.
- ఇటువంటి వారు గ్రూపుపై డామినేషన్ (పెత్తనం/ చేయడానికి ప్రయత్నిస్తుంటారు.
- వీరికి పంచాయితీ, మండల స్థాయి రాజకీయ పార్టీ నాయకులు, దళారీలు, ప్రజా నిధులతో సంబంధాలు వుంటాయి.
- తగవులు, తంటాలు వచ్చినప్పుడు పెద్ద మనుషులుగా, బ్రోకర్లుగా వీరు పాత్ర నిర్వహిస్తుంటారు.
- వీరిపై ప్రజలు చాటుగా ఎన్నో ఫిర్యాదులు చెపుతారు. కమిటీలో ఎవర్ని పెడదాం అని మీరు అడిగితే వీళ్ల పేర్లనే చెపుతారు.
- విలువలతో కూడిన మనుషులు ప్రజల మధ్యలే వుంటారు. అలాంటి వారిని గుర్తించి నాయకులుగా ప్రోత్సహించాలి.

ఒక గ్రామ ప్రజలతో మీకు బాగా సాన్నిహిత్యం ఏర్పడితే తప్ప పై అంశాలను మీరు గుర్తించలేరు. అందుకే ఎక్కువసార్లు గ్రామాలకు వెళ్ళాలి. రాత్రిళ్ళు బస చేయాలి. ఆరంభంలో మీరుపడే ఈ శ్రమ తరువాత మీకు ఎన్నో మంచి ఫలితాలను ఇస్తుంది.

### దరఖాస్తులు:

ఉపాధి హామీ పథకం అమలులో ముఖ్యమైన అంశాలు రెండు. అవి:

- జాబ్‌కార్డు కోసంపెట్టే దరఖాస్తు (ఎఫ్ 1)
- పని కోరుతూ జట్టుగా దరఖాస్తు (ఎఫ్ 4)

### మీరేం చేయవచ్చు:

ముందుగా ఈ రెండు దరఖాస్తులకు మీరు బాగా అలవాటు పడండి. కొన్ని నమూనాలను తీసుకొని, డమ్మీపేర్లు తేదీలతో వాటిని నింపండి. అప్పుడు మీకు అవి అలవాటవుతాయి.

- మీరు గ్రామానికి వెళుతున్నప్పుడు తగినన్ని పట్టుకు వెళ్ళండి. రేపు రాస్తాను, మీకు పంపిస్తాను లాంటి మాటలు ప్రజలకు చెప్పనవసరం వుండదు.
- మీరు కొన్ని రాసిన తరువాత, అదే సమావేశంలో వున్న చదువుకున్న యువతి, యువకులను నింపమని ప్రోత్సహించండి

### మంచి అవకాశం:

జాతీయ ఉపాధి హామీ చట్టంలోని పేదల హక్కు పని కోసం దరఖాస్తులో ఇమిడి వుంది. ఈ దరఖాస్తులు నింపే అవకాశాన్ని వాడుకొని పనిహక్కు, 15 రోజులలో పని కల్పన, నిరుద్యోగ భృతి వంటి అంశాలను మీరు బాగా వివరించవచ్చు. ఈ విషయాన్ని వారికి వివరించాలి. వీలయితే వారి మధ్యనే



కొందరిని పాత్రధారులుగా నిలబెట్టి ఉదాహరణలతో వివరించవచ్చు.

**రశీదు ముఖ్యం:**

పని కావాలని దరఖాస్తు ఇవ్వడం ఒకవంతు అయితే, దరఖాస్తు ఇచ్చి రశీదు తీసుకోవడం మరోవంతు రశీదు తీసుకోలేదు. అంటే దరఖాస్తు ఇవ్వనట్లే లెక్క. 15 రోజులలో పని ఇవ్వకపోతే మనం నిరుద్యోగ భృతి అడగలేం.

**అధికారులను కలవడం:**

జాబ్‌కార్డు, పని దరఖాస్తులు గ్రామంలో సేకరించిన తరువాత వాటిని అధికారులను ఇచ్చే సందర్భంలో కమిటీ సభ్యులు, లేదా గ్రామస్తులను కొందర్ని రమ్మని ప్రోత్సహించాలి. చెవులతో విన్నదానికి, కళ్ళతో చూసిన దానికి ఎంతో తేడా వుంటుంది. వారి సమక్షంలో మీరు దరఖాస్తులు ఇచ్చి రశీదులు తీసుకోండి. క్రమంగా వారినే పంపి దరఖాస్తులు ఇప్పించడం అలవాటు చేయండి.

**ఇతర రికార్డులు:**

జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వి నియోగాన్ని తగ్గించాలంటే ఈ కింది రికార్డులపై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరం. అవి:

- మస్టరు జాబితాలు
- పే ఆర్డర్లు
- పే స్లిప్పులు

మీరు గ్రామానికి వెలుతున్నప్పుడు వీటి నఖల్లు తీసుకొని వెళ్ళండి. వాటి ప్రాముఖ్యతను వివరించడంతోపాటు ఆ సమావేశంలో వున్న వారికి ఇచ్చి వాటిని పరిశీలించేలా ప్రోత్సహించండి. అదే సమావేశంలో వున్న అక్షరాస్యులతో ఆ రికార్డులలోని అంశాలను చదివించి, వాటి ప్రాధాన్యతను వివరించండి.

**సమాచారం - హక్కు:**

రికార్డులు పొందటానికి సమాచార హక్కు చట్టం ద్వారా వున్న అవకాశాలను వివరించండి. ఒక్క జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనే సమాచార హక్కు అంతర్గత భాగంగా ఉంది. అవసరాన్ని బట్టి సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి కావలసిన సమాచారం పొందవచ్చు, అధికారులపై ఒత్తిడి తీసుకురావచ్చు. ఈ పథకంలో కావలసిన సమాచారానికి పంచాయితీ కార్యదర్శి, మండల స్థాయిలో ఎమ్‌డిఒ/కార్యక్రమ అధికారికి దరఖాస్తు చేయవచ్చు. అయితే ఈ చట్టం ప్రకారం కార్యక్రమ అధికారి, గ్రామ పంచాయితీ ఈ క్రింది సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడి చేయాలి.

* కార్యక్రమ అధికారి పేరు, చిరునామా
* పని పత్రం(జాబ్ కార్డు) పొందిన వారి జాబితా
* గుర్తించిన పనుల జాబితా
* స్థలం, తేదీ, ఖర్చు, పని చేసిన కూలీలు వంటి వివరాలతో చేపట్టిన పనుల జాబితా
* తేదీ, స్థలం వంటి వివరాలతో పని కేటాయించిన కూలీల జాబితా
* కనీస వేతనాల వివరాలు
* గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సృష్టించిన ఆస్తులు / వనరుల జాబితా
* చెల్లించిన వేతనాల వివరాలు

పైన పేర్కొన్న సమాచారం గ్రామసభలో, పంచాయితీ నోటీసు బోర్డులో వెల్లడి చేయకపోతే ఆ వివరాలన్నీ అడగవచ్చు. ఇంకా అడగగలిగనవి - **మస్టరు జాబితా, గ్రామసభ సమావేశ మినిట్స్, దరఖాస్తులు తిరస్కరించిన వారి జాబితా, సామాజిక తనిఖీ నివేదికలు, ఆడిటర్ల నివేదికలు, నిరుద్యోగ భృతికి అర్హులైన వారి జాబితా / చెల్లించిన వారి జాబితా, ఉపాధి కల్పనకు సంబంధించి రికార్డులు, కొలతల పుస్తకం, ఆమోద పత్రాల ప్రతులు, ఆస్తులు / వనరుల రిజిస్టరు.**

అవినీతి జరిగిందా లేదా అనే దానితో సంబంధం లేకుండా వారితో కనీసం ఒక మస్టరు జాబితా, పే ఆర్డరులకు దరఖాస్తు చేయండి. చెవులతో విన్నదానికంటే కళ్ళతో చూసింది ఎక్కువ. కళ్ళతో చూసినదానికంటే అనుభవం ద్వారా తెలుసుకునేది ఎక్కువ.



**సమాచారంతో వెళ్ళండి:**

మీరు ఏదైనా ఒక గ్రామానికి వెళ్ళాలని ముందుగా ప్రణాళిక వేసుకున్నప్పుడు ఆ గ్రామం రికార్డుతో వెళితే మీకు ఎన్నో ఉపయోగాలు వున్నాయి.

⁕ అప్పటికి జరిగిన పని మస్తరు, పే ఆర్డరుతో వెళ్ళడం వల్ల తాజా పరిస్థితి తెలుస్తుంది

⁕ ప్రజలలో ఉత్సుకత ఏర్పడుతుంది.

⁕ మీరు తమ పేర్లు కనిపించే రికార్డుతో రావడం వల్ల, వారిలో మీ పట్ల నమ్మకం పెరుగుతుంది

⁕ మీరు రికార్డులతో వచ్చారని, మీ వద్ద మొత్తం సమాచారం వుందనే విషయం క్షణాల్లో స్థానిక అధికారులకు చేరుతుంది

⁕ సమాచారం ఎవరి చేతిలో వుందో వారి చేతిలో ఒక ఆయుధం వున్నట్లే. అది ప్రజల ఆత్మస్థయిర్యాన్ని పెంచితే అవినీతి పరులకు భయాందోళన కలిగిస్తుంది.

⁕ మీరు గాలిపోగు చేసి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వరనీ, ఏది మాట్లాడినా నిర్దిష్ట సమాచారంతోనే మాట్లాడతారని అటు ప్రజలు ఇటు అధికారులు గుర్తిస్తారు. అది మీకు, మీ సంఘ నిర్మాణానికి ఎన్నో విధాలుగా సహాయపడుతుంది.

**సమాచారం ఎలా?**

ఉపాధి హామీ పథకంలో రికార్డుల సమాచారం కోసం సమాచార చట్టం ద్వారా దరఖాస్తు చేస్తే కనీసం 30 రోజులు మనం ఆగాలి. ఆంత సమయం వృధా కాకుండా ఎలా? దానికో చక్కని పరిష్కారం వుంది. మీరు కొద్దిగా చొరవ, నేర్చుకోవాలనే ఆసక్తి వుంటే 40 నిమిషాలు చాలు.

**నెట్‌లోకి వెళ్ళండి:**

ఇవ్వాళ ఇంచుమించుగా ప్రతి పట్టణంలోను ప్రైవేటు ఇంటర్‌నెట్ కేంద్రాలు వున్నాయి. గంటసేపు నెట్ వాడితే 10 నుండి 15 రూపాయలు ఖర్చు అవుతుంది. www.nrega.ap.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్ళి రాష్ట్రంలోని ఏ గ్రామానికి చెందిన మస్తరు జాబితా, పే ఆర్డర్ల నఖల్లు మీరు తీసుకోవచ్చు. ఇందులో చాలా సమాచారం తెలుగులో కూడా ఉంటుంది. నెట్ చూడటం రాదని భయపడకండి. ఆ సెంటరును నడిపే యజమానిని సహకరించమని అడగండి. మొదట్లో తప్పులు చేసినా అందువల్ల కొంపలు మునిగిపోవు. కంప్యూటరు పేలిపోదు. మహా అయితే మీకు కొద్దిగా డబ్బులు ఖర్చు అవుతాయి. అంతే. నెమ్మదిగా మీరు పట్టు సాధిస్తారు.

రికార్డును తీసుకొని ప్రజల మధ్యకు వెళ్ళినప్పుడు వారి నుండి వచ్చిన స్పందన చూసినప్పుడు, మీరు పడిన శ్రమను మర్చిపోతారు. దాని విలువ గ్రహిస్తారు.

**సమస్యల పరిష్కారానికి మరికొన్ని మార్గాలు**

❖ ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్/ పంచాయితీ కార్యదర్శి దగ్గర, మండలంలో పి.ఓ./ ఎ.పి.ఓ దగ్గర ఫిర్యాదుల రిజిష్టరు తప్పనిసరిగా ఉండాలి. కూలీలు, వారితో పనిచేసే వివిధ సంఘాలు, కార్యకర్తలపై హక్కుల సాధనలో వచ్చి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆ రిజిష్టరులో నమోదు అయ్యేటట్టు చూడాలి.

❖ స్థానిక అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే **155321** (రాష్ట్ర స్థాయిలో) ఫోన్ నెంబరుకు ఫోను చేసి వారి ఫిర్యాదును నమోదు చేయించాలి. పైన పేర్కొన్న హక్కులు, సౌకర్యాలు పద్ధతులలో ఏ సమస్య ఉన్నా వాటిని అందులో పేర్కొనాలి.

❖ తమ గ్రామంలో సోషల్ ఆడిట్ జరిగేటప్పుడు ఉపాధిహామీ పథకంలో పని చేసిన కుటుంబాలు చురుకుగా పాల్గొనేవిధంగా ప్రోత్సహించాలి.

❖ ఉపాధి హామీ పథకంలో ఎక్కువగా అవకతవకలు జరిగాయని అనిపించినా, నిబంధనలను పాటించకపోయినా తమ గ్రామంలో సోషల్ ఆడిట్ నిర్వహించవలసిందిగా కూలి సంఘాలు మండల అధికారి (పిఓ/ఎపిఓ)ని రాత పూర్వకంగా కోరవచ్చు లేదా ఏదైనా స్థానిక ప్రజా సంఘాల సహకారాన్ని తీసుకోవచ్చు.

❑

# జాతీయ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది, అధికారుల బాధ్యతలు




| పని/బాధ్యత వివరాలు | మేట్ | ఫీ.అ. | టె.అ. | గ్రా.కా | ఏ.పి.ఓ | పి.ఓ. |
|---|---|---|---|---|---|---|
| జాబ్ కార్డులకు దరఖాస్తు తీసుకొని రశీదు ఇవ్వడం | | | | ✓ | ✓ | |
| జాబ్ కార్డు ఇవ్వడం | | ✓ | | | | |
| అకౌంటు ఓపెన్ చేయించడం | | ✓ | | | | |
| పనుల కొరకు దరఖాస్తు తీసుకొని రశీదు ఇవ్వడం | | ✓ | | ✓ | ✓ | |
| పని ప్రారంభ లేఖ ఫీల్డ్ అసిస్టెంట్‌కి ఇవ్వడం | | | | | ✓ | |
| పని ప్రారంభిస్తున్నట్టు కూలీలకు లేఖ పంపడం | | ✓ | | | | |
| దరఖాస్తు ఇచ్చిన 15 రోజులకు పని చూపించడం | | ✓ | | | ✓ | |
| పని చూపించలేని పక్షంలో నిరుద్యోగ భృతికి ధరఖాస్తు తీసుకోవడం, నిరుద్యోగ భృతి చెల్లించడం | | ✓ | | | ✓ | |
| గ్రూపులవారీగా /మేట్‌వారీగా పని ప్రారంభించడం | | ✓ | | | | |
| పని కొలతలు, రేట్లు గురించి కూలీలకు వివరించడం | | ✓ | ✓ | | | |
| పని ప్రాంతంలో పని వివరాలు తెలియచేసే బోర్డు నిర్వహణ | | | | ✓ | | |
| పని ప్రాంతంలో వసతులు ఏర్పాటు | ✓ | ✓ | | | ✓ | |
| ప్రధమ చికిత్స పెట్టె | ✓ | ✓ | | | | |
| పని సంబందిత ప్రమాదం జరిగితే తగు చర్యలు తీసుకోవడం | | ✓ | | | | |
| రోజుకు రెండు పూటల మస్టర్‌లో హాజరు వేయడం బహిరంగంగా సాయంకాలం చదవడం. | ✓ | ✓ | | | | |
| ప్రమాదం జరిగితే ఖర్చులకు రూ॥ 2,000/- దగ్గర పెట్టుకోవడం | | | | | ✓ | ✓ |
| ప్రతి శనివారం మస్టరు చదివి వినిపించి ముగ్గురు సాక్షి సంతకాలతో మస్టర్‌ను క్లోజ్ చేయడం. | ✓ | ✓ | | | | |
| వారానికి ఒకసారి చేసిన పనికి కొలతలు సరిగా ఉన్నాయో లేవో చూసుకొని మస్టర్ క్లోజ్ చేయడం | | ✓ | ✓ | | | |
| మస్టర్‌ను పంచాయితీ ద్వారా ఎం.పి.డి.ఓ ఆఫీసులో ఇవ్వడం | | | ✓ | ✓ | | |
| మండల ఆఫీసుకు వచ్చిన తర్వాత మస్టరును సరి చూసుకుని సంతకంతో మండల కంప్యూటర్ సెంటర్‌లో ఇవ్వడం | | | | | ✓ | ✓ |
| మస్టర్ ఎంటర్ అయిన తర్వాత పే ఆర్డర్ ఇవ్వడం | | | | | ✓ | ✓ |
| పే ఆర్డర్, చెక్ పోస్టాఫీసుకు పంపడం | | | | | | ✓ |
| పే స్లిప్స్ - కూలీలకు ఇవ్వడం | | ✓ | | | | |
| పదిహేను రోజులలోపు కూలీ అందేలా చూడడం | | | | | | ✓ |
| గ్రామ పంచాయితీలో రికార్డుల నిర్వహణ | | ✓ | | | | |
| జాబ్‌కార్డులలో పని, చెల్లింపుల వివరాలు నమోదు | | ✓ | | | | ✓ |
| సమాచార గోడ నిర్వహణ | | ✓ | | | | |
| గ్రామ సభల ద్వారా పనులు గుర్తించడం | | | | | ✓ | ✓ |
| గుర్తించిన పనులను గ్రామ సభలో తీర్మానం ద్దారా ఆమోదించాలి | | | | | ✓ | |
| గుర్తించిన పనులకు అంచనాల తయారీ | | | ✓ | | | ✓ |
| అంచనాలకు సాంకేతిక మంజూరు ఇప్పించడం | | | | | | ✓ |
| గుర్తించిన పనులకు పరిపాలన పరమైన ఆమోదం- కలెక్టరు(డిపిసి), పి.డి, డిడబ్ల్యుఎమ్ఎ | | | | | | |

**ప్రత్యక్షంగా చేయవలసిన బాధ్యత, పని జరిగేలా చూసే బాధ్యత**

ఫీ.అ. - ఫీల్డ్ అసిస్టెంట్, టె.అ. - టెక్నికల్ అసిస్టెంట్, ఎ.పి.ఒ. - అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి, పి.ఒ. - ప్రోగ్రామ్ అధికారి/ఎమ్.డి.ఒ., గ్రా.కా - గ్రామకార్యదర్శి

# మెదక్ జిల్లా కార్యకర్తల ప్రయత్నం, అనుభవాలు




మెదక్ జిల్లా చిన్నకోడూర్ మండలంలో సామాజిక తనిఖీలో అవినీతి అక్రమాలు వెలుగు చూశాయనే నెపంతో 2008 డిసెంబరు నుండి 3 నెలల పాటు ఉపాధి హామీ పథకం పనులు నిలిపివేశారు. దీంతో కూలీలకు పనులు లేకపోవడంతో పనికోసం నరకయాతన పడ్డారు. తిండి, కుటుంబ పోషణకు ఇబ్బందులు పాలవుతున్నామని కూలీలు, 'పని అయినా కల్పించండి, తిండైనా పెట్టండి' అంటూ 5న చిన్నకొడూర్ ఎంపిడిఓ కార్యాలయం ముందు దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో కూలీలు ధర్నా చేశారు. అంతేకాకుండా సిద్దిపేట ఆర్‌డిఓకు పనులు కల్పించాలని వినతిపత్రాలు సమర్పించారు. పనుల నిలిపివేత సమస్యను ఇజిఎస్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్ళగా జిల్లా డిడబ్ల్యుఎంఎ, పిడి, ఎపిఒలతో జరిగిన సమీక్షలో సైతం చర్చించారు. దీంతో అనంతపురం నుండి 8 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లను డిప్యూటేషన్‌పై పంపి పిఎంపి ప్రణాళికలు తయారు చేశారు. మే చివరి నుండి 4 గ్రామాలలో పనులు ప్రారంభించి మండలంలోని అన్ని గ్రామాలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 24 గ్రామాలలో పనులు నడుస్తున్నాయి. పిడి సైతం ఆకస్మిక తనిఖీ చేసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి పనులు వేగవంతం చేశారు. ఉపాధి హామీ



కూలీలను సంఘటితం చేసి వారి హక్కులపై చైతన్యపరచడం ద్వారానే ఇది సాధ్యమయ్యింది.

ఉపాధి హామీ చట్టం ప్రకారం పనికి దరఖాస్తు చేసుకున్న 15రోజులలోపు పని కల్పించాలి. జూన్ 23, 2008నాడు మెదక్ జిల్లా చిన్నకోడూర్ మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్, మల్లారం, రాముని పట్ల, దౌలతాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామ పంచాయితీ కునాపూర్ గ్రామానికి చెందిన 168 మంది కూలీలు పనికోసం దరఖాస్తు చేసుకున్నారు. నెలరోజుల తరువాత సైతం పని కల్పించకపోవడంతో జూలై 27న ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నాలు చేయడం, ఇజిఎస్ డైరెక్టరేట్‌తో ఎప్పటికప్పుడు చర్చించడంతో ఎట్టకేలకు నిరుద్యోగభృతి చెల్లించాలని జిల్లా కలెక్టర్, ఎంపిడిఓలకు కమీషనర్ తరఫున ఇజిఎస్ డైరెక్టర్ లేఖలు రాశారు. కూలీలు వారంతట వారుగా నిరుద్యోగభృతి (జరిమానా) చెల్లించాలని పలుమార్లు ధర్నాలు చేశారు. ఎంఐయులో భాగంగా పిడితో జరిగిన సమావేశంలో సైతం చర్చించగా నిరుద్యోగభృతి చెల్లించాలని ఎంపిడిఓ, ఎపిఓలను ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులకు ఫిర్యాదు చేయడం, పత్రికల్లో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టడంతో విచారణ పేరుతో కిందిస్థాయి అధికారులు ఇంకా కాలయాపన చేస్తున్నారు. ❑




## కనీస కూలి రేట్ల సాధనకు ఎపివివియు 'న్యాయ' ప్రయత్నం

*గ్రామ స్థాయిలో కూలీలను సంఘటితపరచడం, వారి హక్కుల సాధనకు ఉద్యమించడం ఎంత ముఖ్యమో ప్రభుత్వ విధానాలను విశ్లేషించి అందులో లోపాలను సరిదిద్దే ప్రయత్నం కూడా అంతే అవసరం. గ్రామ స్థాయిలో ఉద్యమించడం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు తక్కువ కాకుండా వేతనాలు సాధించవచ్చు.*

అయితే ప్రభుత్వ నిర్ధేశించిన వేతనాలే తక్కువ అయితే? రేట్లు పెంచమని కూలీలను సంఘటిత పరచడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో పాటు రాజ్యాంగ బద్ధంగా ఇచ్చిన హక్కుల సాధనకు కోర్టులను ఆశ్రయించడం కూడా అవసరం. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఈ ప్రయత్నం చేసింది. ముందుగా అక్టోబరు, 2008లో సవరించిన వ్యవసాయ కనీస వేతనాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లింది. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉపాధి హామీ పథకంలో కూడా రేట్లు పెంచాల్సి ఉంటుందని, ప్రస్తుత ఉన్న రేట్లు నిర్దేశిత కనీస వేతనాల కన్నా తక్కువ అనే విషయాన్ని గ్రామాలు, మండలాలలో అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలని చైతన్య పరిచింది. ఆ క్రమంలో తమకు వస్తున్న కూలి కనీస వేతనాల చట్టం ప్రకారం తక్కువ వస్తున్నాయని, తమకు న్యాయం చేయవలసిందిగా ఉపాధి కూలీలు కోర్టును ఆశ్రయించడంలో సహకరించింది. రాష్ట్ర హైకోర్టు పై వ్యాజ్యాన్ని స్వీకరిస్తూ ప్రభుత్వం ప్రస్తుతం అమలుపరుస్తున్న రేట్లను ఎనిమిది వారాల పాటు నిలిపి వేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

ఆ కాలంలో కనీస వేతనాల చట్టం ప్రకారం 112-119 రూపాయలు చెల్లించవలసిందిగా ఆదేశాలిచ్చింది. అయితే ప్రభుత్వం అంతకుముందన్న 80 రూపాయలను 100 రూపాయలకు పెంచింది కాని కోర్టు ఉత్తర్వులను పూర్తి స్థాయిలో పాటించలేదు. ఈ కేసు మళ్ళీ సెప్టెంబరు 3 తరువాత కోర్టు వారి ముందుకు వస్తుంది. అక్కడ పూర్తి న్యాయం జరుగుతుందని ఉపాధి హామీ కూలీలు ఆశిస్తున్నారు.

(7వ పేజీ తరువాయి...)

**సమాచార హక్కు చట్టం ఉపయోగం:**

పేదలకు ప్రభుత్వ భూముల సాధనలో సమాచార హక్కును వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు

1. మండలంలో గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల, అసైన్‌మెంట్ భూముల మొత్తం వివరాలు లేదా ఏదైనా అవసరం ఉన్న గ్రామం/గ్రామాల వివరాలు కావాలని పౌర సమాచార అధికారి, తహశీల్దారు కార్యాలయానికి సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చెయ్యవచ్చు.

**వివరాలు:** గ్రామాల వారీగా, సర్వే నెం. వారీగా విస్తీర్ణం, పట్టా దారుని పేరు, కులం, ప్రస్తుతం సాగు చేస్తున్న వారి పేరు కులం, డి-పట్టా మంజూరు చెయ్యని ప్రభుత్వ భూమి అయితే ప్రస్తుత సాగు/ఆక్రమణ స్థితి, అన్యాక్రాంతమయ్యిందీ లేనిదీ మొదలగునవి.

2. మండలంలో గ్రామం వారీగా సర్వేనెంబరు వారీగా గుర్తించిన అన్యాక్రాంతం కేసుల వివరాలు, నోటీసుల ఎవరెవరికి, ఎంతమందికి జారీ చేసారు, ఏమేం చర్యలు తీసుకున్నారు మొదలగు వివరాలు

3. అసైన్‌మెంట్ భూమిని ఏదైన ప్రాజెక్టుకోసం ప్రభుత్వం సేకరించినా లేదా సేకరించే ఉద్దేశంలో ఉన్నా, జారీ చేసిన నోటీసుల వివరాలు, ఎవరికోసం సేకరిస్తుందీ, ఎంత సేకరిస్తుంది, నష్టపరిహారం లేదా ఎక్స్‌గ్రేషియా చెల్లించిన లేదా చెల్లించబోయే వివరాలు మొదలగునవి.

4. ప్రభుత్వ భూమి పంపిణీ, అన్యాక్రాంతమైన భూముల విషయంలో తగిన చర్యలకి సంబంధించి కోనేరు రంగారావు కమిటీ సూచనలు, వాటిపై ప్రభుత్వ ఉత్తర్వుల అమలు పరిస్థితి పై జిల్లా కలెక్టరు కార్యాలయానికి సమాచారహక్కు చట్టం ద్వారా ధరఖాస్తు చేయవచ్చు. తద్వారా జిల్లా యంత్రాంగంపై వత్తిడి తీసుకురావచ్చు.




# సమగ్ర భూమి అభివృద్ధి పథకం - ఇందిర ప్రభ

వి. దుర్గాప్రసాద్, పి. శంకర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో నాబార్డు ఆర్థిక సహాయంతో దశలవారీగా పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను అభివృద్ధిపరిచి సాగు యోగ్యంగా చేసే కార్యక్రమాన్ని ఇందిరప్రభ పేరుతో చేపట్టింది. 2004వ సంవత్సరం నుండి గ్రామీణ మౌలిక సదుపాయాల నిధి (ఆర్ఐడిఎఫ్) నిధులతో రెండు విడతలుగా (ఆర్ఐడిఎఫ్ -9, 10) 448 కోట్ల రూపాయలతో 2.8 లక్షల కుటుంబాలకు చెందిన 3.8 లక్షల ఎకరాల భూమిని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కాలవ్యవధి మూడు సంవత్సరాలుగా నిర్ణయించారు. అయితే 2007-08 సంవత్స రాలలో పూర్తికావలసిన పథకం నిధుల విడుదల, అమలులో లోపాల వల్ల 2009కి కూడా పూర్తవ్వలేదు.

**ఆర్ఐడిఎఫ్ 13 అమలు విధానం:**

మూడు సంవత్సరాల అమలు అనుభవంతో ఈ పథకంలో లోపాలను సవరించి మరింత మెరుగ్గా అమలు చేయాలనే ఉద్దేశంతో కొత్తగా ఆర్ఐడిఎఫ్-13 కింద ఎంపిక చేసిన లక్షన్నర ఎకరాల అభివృద్ధికి అమలు ప్రక్రియలలో మార్పులు చేర్పులు చేశారు. దాంతో పాటు ఈ పథకాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానించారు. అంటే ఇందిర ప్రభ పథకంలో ఎంపిక చేసిన భూముల అభివృద్ధికి మనుషులు చేయగలిగిన పనులకు నిధులు ఉపాధి హామీ ద్వారా, ఇతర పనులు, బోర్లు ద్వారా నీటి వసతి మొదలగునవి నాబార్డు నిధుల ద్వారా చేపట్టేవిధంగా మార్పులు చేశారు.

ఈ క్రమంలో గతంలో ఆర్ఐడిఎఫ్ 9, 10 బ్యాచ్‌లలో పనులు జరిగిన క్రమాన్ని, అనుభవాలను, అసైనీల భాగస్వామ్యాన్ని దృష్టిలో వుంచుకొని సిఆర్‌పి (కమ్యూనిటీ రిసోర్సు పర్సన్స్) విధానాన్ని రూపొందించారు. ఆర్ఐడిఎఫ్ 9, 10 బ్యాచ్‌లలో వారి వారి పొలాలను ఇందిరప్రభలో భాగంగా అభివృద్ధి చేసుకొని ఒక కూలి స్థాయి నుండి రైతుస్థాయికి ఎదిగిన వారితో వారి అనుభవాలను, వారు పని చేసుకొని సాధించిన ఫలితాలను ఆర్ఐడిఎఫ్ 13లో భూమిని అభివృద్ధి చేసుకునే అసైనీలకు తెలియచేయగలిగిన వారినే కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌గా ఎంపిక చేశారు. ఈ పథకం అమలు ప్రక్రియను నాలుగా దశలుగా విభజించారు.

**సన్నాహక దశ:** అసైనీలు, వారి భూముల వివరాలు, భూమి వారి చేతిలో ఉందా అన్యాక్రాంతం జరిగిందా చూడటం, అసైనీలకు కార్యక్రమం పై అవగాహన, ఉమ్మడి ప్రయోజనాల బృందాలను ఏర్పాటు చేయడం, పారావర్కర్లను నియమించుకోవడం, అసైనీలందరికి ఇజిఎస్‌లో జాబు కార్డులు, పోస్టాఫీసులో అకౌంట్లు వుండే విధంగా చూడటం ఈ దశలో పూర్తిచేయవలసిన పనులు

**ప్రణాళిక దశ:** ఈ దశలో అసైనీల వారీగా భూమి అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయడం, గుర్తించిన పనులకు ఆమోదం, మంజూరు ఆదేశాలు ఇవ్వడం, పట్టాదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం, పనులు క్రమబద్ధంగా జరిగేలా చూడటం

**అమలు దశ:** ఈ దశలో రెండు విధాలుగా నిధులు ఖర్చు చేయడం జరుగుతుంది. నాబార్డు నిధులు, ఇజిఎస్ నిధులతో పనులు చేయడం

**నాబార్డు నిధులతో:**

నాబార్డు నుండి వచ్చిన నిధులతో బోరుబావుల తవ్వకం, మోటారు పంపులు కొనుగోలు, యంత్రాలలో భూమి చదును, ముళ్ళపొదలు, ముళ్ళ కంపలు తొలగించడం, ట్రాక్టర్లతో లోతైన దుక్కి క దున్నడం వంటివి.

**ఇజిఎస్ నిధులతో:**

ఇజిఎస్ నిధులతో భూమి, తేమ సంరక్షణ, భూమి కోత నియంత్రణ, వర్షపు నీరు సంరక్షణ, పండ్ల తోటల పెంపకం, భూమి సారం పెంచే పనులు, సాంప్రదాయేతర పనులు చేపట్టవచ్చు.

**రాష్ట్రస్థాయిలో సిఎల్‌డిపిలో అమలు విధానంలో వచ్చిన మార్పులు:**

ఆర్ఐడిఎఫ్ 13 ప్రారంభంలో నాబార్డు నిధులు హక్కుదారులతో ఏర్పరచిన ఉమ్మడి ప్రయోజనాల బృందాల (సిఐజిలు) ఆధ్వర్యంలో ఖర్చయ్యేవి. అయితే ఆ విధంగా సంఘాలను ఏర్పరిచి, వారికి కావలసిన అవగాహన, శిక్షణ, ఇవ్వడానికి కావలసిన సిబ్బంది, నిధులు, సమయం కేటాయించలేక ఇప్పుడు ఆ నిధులను ఎంపిడిఓ ద్వారా ఖర్చు చేయమని రాష్ట్రస్థాయి నుండి ఆదేశాలు ఇచ్చారు. దీంతో



గ్రూపులను, భూ హక్కుదారుల భాగస్వామ్యాన్ని నిర్వీర్యం చేశారు.

**పథకం అమలులో సమస్యలు:**

* ఈ పథకాన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయడం కారణంగా, పథకం నిర్వీర్యమై, అమలు నత్త నడకన సాగుతోంది. నిధుల ఖర్చు, భూముల అభివృద్ధి వివరాలే దీనికి నిదర్శనం.
* ఈ పథకంలో భాగంగా గుర్తించిన పనులన్నీ 2008 ఏప్రిల్ నుండి 2009 ఏప్రిల్ మధ్యలో పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ తొలుత భావించింది. అయితే కేటాయించిన మొత్తం 150 కోట్ల నాబార్డు నిధులలో జూన్, 2009 నాటికి కేవలం 40 కోట్లే ఖర్చయ్యింది. అంటే మూడోవంతుకన్నా తక్కువ. ఇంకా ఉపాధి హామీ పథకం ద్వారా ఈ భూముల్లో ఖర్చు పెట్టాల్సి నిధుల పరిస్థితీ అంతే. 1.50 లక్షల ఎకరాల అభివృద్ధి లక్ష్యమైతే అధికారిక లెక్కల ప్రకారం సంవత్సరం తరువాత, జూన్ 2009 నాటికి అభివృద్ధి చేసింది కేవలం అయిదు ఎకరాలు !!
* పథకంలో ముందస్తు ప్రణాళిక ద్వారా గుర్తించిన భూ సమస్యలు పరిష్కరించకపోవడం
* నాబార్డు నిధులను పూర్తిగా విడుదల చేయకుండా నామ మాత్రంగా విడుదల చేయడం, వాటిని కూడా ఖర్చు చేయకపోవడం.
* ఇజిఎస్ నిధుల కింద చేపట్టిన పనులను సకాలంలో చేపట్టక పోవడం, పథకం పురోగతిని నిరంతరం సమీక్షించక పోవడం, నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడం
* బ్లాక్‌లను అధికారులు సందర్శించకపోవడం, సమీక్షలు చేయకపోవడంతో భూ అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు నడుస్తుంది.
* భూహక్కుదార్ల భాగస్వామ్యాన్ని పెంపొందించకుండా నిర్వీర్యం చేస్తూ నిధులను ఎంపిడిఓల ఖాతా నుండి ఖర్చు చేయాలని నిర్ణయించారు. నిధుల ఖర్చులో భూహక్కు దారుల గ్రూపుల భాగస్వామ్యాన్ని నామమాత్రం చేసి సిబ్బంది(టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతరులు) నిధులను ఖర్చు చేయడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది.
* భూహక్కుదార్లకు వ్యక్తిగత ప్రొసిడింగ్స్ (గుర్తించిన పనులు, కేటాయించిన నిధుల వివరాలతో) ఇవ్వకపోవడం. వేసిన బోరుబావులకు మోటార్లు బిగించకపోవడం, విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయక పోవడం,

**కార్యకర్తలు చేయవలసిన పనులు:**

* ఆయా మండలాలలో అమలులో ఉన్న ఇందిర ప్రభ పథకం వివరాలను (గ్రామం, సర్వేనెం., హక్కు దారులు, ఎకరాలు, గుర్తించిన పనులు, కేటాయించిన నిధులు, ఇప్పటి వరకు ఖర్చు అయిన నిధులు వంటివి) మండల అభివృద్ధి అధికారి(ఎమ్‌డిఒ) కార్యాలయంలో సేకరించడం
* ఆయా గ్రామాలను సందర్శించి హక్కుదారులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను గుర్తించడం, వారికి పథకంపై , వారి హక్కుల పై అవగాహన కల్పించడం, ఆ సమస్యల సాధనకు మార్గాలు, వారు చేయవలసిన కార్యక్రమాలపై చర్చ చేయడం, కార్యాచరణ రూపొందించడం
* గుర్తించిన సమస్యలను పత్రికల ద్వారా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల దృష్టికి తీసుకువెళ్లడం
* హక్కుదారులను సంఘటితపరచి గ్రామ స్థాయి, మండల స్థాయి సిబ్బంది, అధికారులను (ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, సహాయ కార్యక్రమ అధికారి, ఎమ్‌డిఒ, ఎపిడి) నిలదీయడం, పథకం సక్రమ, సత్వర అమలుకు వారిపై ఒత్తిడి తేవడం. మండల, జిల్లా కేంద్రాలలో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టడం.

**సమాచార చట్టం ఉపయోగం:**

ఆయా మండలాలలో సమగ్ర అభివృద్ధికి ఎంపిక చేసిన బ్లాకు (ప్రాంతం) వివరాలు, అందులో జరిగిన పని, ఖర్చు వివరాలు పొందటానికి, గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చేపట్టిన చర్యలు తెలుసుకోవటానికి, వారి వారి బాధ్యతలు ఎంతవరకు నిర్వర్తించారు, పథకం అమలు ఆలస్యానికి కారణాలు తెలుసుకోవటానికి సమాచార హక్కు చట్టం ఉపయోగించవచ్చు.

ఈ చట్టం కింద ఆయా మండల అభివృద్ధి కార్యాలయం లేదా ప్రాజెక్టు డైరెక్టరు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలోని పౌర సమాచార అధికారికి దరఖాస్తు చేసి తగిన సమాచారం పొందవచ్చు.

## కార్యకర్తల ప్రయత్నాలు - అనుభవాలు:

**మిరుదొడ్డి మండలం, మెదక్ జిల్లా**

ధర్మారం గ్రామంలోని అసైన్డ్ భూములను ఇందిరప్రభ ఆర్ఐడిఎఫ్- 13 కింద సమగ్ర అభివృదికి ఎంపిక చేశారు. ఈ బ్లాక్‌లో ఎస్సీలు 81, ఎస్టీ 1, బిసిలు 110, ఇతరులు 6గురు, మొత్తం 198 మంది భూ హక్కుదారులకు చెందిన 286 ఎకరాల అసైన్డ్ భూమిని ఎంపిక చేశారు. ఈ భూమి పొదలు, చెట్లు, రాళ్ళు రప్పలతో నిండి వుంది. ఈ భూముల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నాబార్డు కింద 27.4 లక్షలు, ఉపాధి హామీ పథకం కింద 67.5 లక్షలు, మొత్తం 94.9 లక్షల నిధులను కేటాయించంది.

దాదాపు సంవత్సరం దాటినా, నాబార్డు కింద ఈ బ్లాక్‌కు కేవలం 2 లక్షలు మాత్రమే విడుదల జరిగింది. ఈ నిధులతో సైతం ఈ భూములలో బోరు వేయరాదని, భూగర్భ జలాలు అడుగంటి పోయాయని అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత నివేదికల ఆధారంగా కాకుండ తిరిగి భూగర్భ జలాలపై జియాలజిస్టులతో సర్వే చేయాలని జిల్లా కలెక్టర్, డిడబ్ల్యుఎంఎ ప్రాజెక్టు డైరెక్టర్‌తో చర్చించారు. అయినప్పటికి అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించింది. దీంతో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో మరోసారి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భూ హక్కు దారులు ధర్నా చేయడం, పత్రికలలో నిధులున్నా అభివృద్ధి సున్నా అంటూ పెద్దఎత్తున వార్తలు రావడంతో స్థానిక శాసనసభ్యులు హరీష్‌రావు స్పందించి, అధికారులతో చర్చించి ఎట్టకేలకు బోర్లకు శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులతో 2 బోర్‌వెల్స్ వేసి రెండు మోటార్లు బిగించారు.

ఉపాధి హామీ పథకం కింద 250 ఎకరాలలో పొదల తొలగింపు, నల్ల మట్టి తోలారు. ప్రస్తుతం దున్నడానికి పనులు ప్రారంభించారు. ఈ బ్లాక్‌లోని భూ హక్కుదారులందరికి జాబ్ కార్డులు జారీ చేశారు. భూమి సరిహద్దులను గుర్తించారు.

**చాగలమర్రి మండలం, కర్నూలు జిల్లా**

చింతలచెరువు గ్రామానికి చెందిన 28 మంది ఎస్సీ/ఎస్టీ/బిసి/ఇతరులకు చెందిన 76.9 ఎకరాల భూమిని గుర్తించి నాబార్డు కింద 10:84 లక్షలు, ఇజిఎస్ ద్వారా 15.57 లక్షలు మంజూరు చేశారు. ఈ భూమిలో ఉన్న ఎక్కువ మందికి చెందిన ఎస్‌సి భూములకు పక్క ఉన్న ఇతర పట్టాదారులు దారి ఇవ్వకపోవడంతో వారి భూములు బీడుపడి ఉన్నాయి. ఈ పథకం కింద భూముల అభివృద్ధి జరిగి, వారు సాగు చేసుకోవాలంటే ముందుగా ఈ సమస్యను పరిష్కరించడం అవసరం. దళిత బహుజన్ ఫ్రంట్ కార్యకర్త మధు ఎస్సీల భూముల్లోనికి దారిలేని కారణంగా అక్కడి ఎమ్మార్వో, ఆర్‌డిఓలకు దరఖాస్తు చేయించారు. అసైనీలందరినీ సంఘటిత పరచి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మార్వో ఆ భూములకు సర్వే నిర్ణయించి హద్దులు ఏర్పాటు చేయడం, ఎస్సీల భూములకు ప్రత్యేకంగా దారి ఏర్పాటు చేయించారు. ఎస్సీలకు చెందిన భూముల్లో ఆయా కుటుంబంలోని ప్రతి ఒక్కరితో పాటు ఇతరులు కూడా పనిచేసు కోవడం మూలంగా 76.9 ఎకరాల్లో 5 ఎకరాలు మినహాయించి మొత్త భూమిని అభివృద్ధి చేసుకున్నారు. ప్రస్తుతం ఆ భూమిలో పంట వేసుకున్నారు.





# సాగు భూములైన బీడు భూములు

వీరేపల్లి పేట అనంతపురం జిల్లా కదిరి మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో వుంది. పట్నం పంచాయితీకి చెందిన ఒక శివారు (మజిర) గ్రామం. ఈ పల్లెకు పోవాలంటే ఒకే ఒక బస్సు వుంటుంది. అది కూడా ఉదయం ఒకసారి, సాయంత్రం మరోసారి వెళు తుంది. ఒకవేళ ఏ కారణంతో నైనా బస్సు రాకపోతే 5 నిమిషాలు నడిచి ప్రధాన రహదారికి చేరుకోవాలి. మండల కేంద్రానికి దూరంగా విసిరేసినట్లు వుండటంతో ఏ అధికారి ఇక్కడకు రాడు. గ్రామానికి వుండవలసిన కనీస సౌకర్యాలేమీ ఇక్కడ లేవు.

జాతీయ ఉపాధి హామీ పథకంలో పంచాయితీ స్థాయిలో కీలకమైన వ్యక్తి ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ). ఈ పంచాయితీలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో వీరేపల్లిపేటలో ఉపాధి పనులు మొదలుకావడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి.

గ్రామంలోని ప్రజలకు వ్యవసాయం తప్ప వేరే జీవనోపాధారం లేదు. అంతా వర్షంపై ఆధారపడిన మెట్ట వ్యవసాయమే. గ్రామంలో ఎక్కువగా ఎర్రనేలలు. వేరుశనగ పంటకు బాగా పనికి వస్తాయి. కానీ భూములు రాళ్లు, రప్పలతో కూడుకున్నవి. ఎవరో తెచ్చి కుమ్మరించి పోసినట్లుగా పొలాల నిండా రాళ్ళు. ఈ రాళ్ల మధ్య సేద్యం అంటే రైతుకు రక్తం కళ్ళవెంట కారినట్లు వుండేది. అటు వ్యవసాయం సరిగ్గా లేక, ఇటు ఉపాధి లేక, బైటకు వెళ్దామంటే దారిలేక, పల్లెలోని సన్న, చిన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు కష్టాలు పడేవారు. ఇదే పరిస్థితుల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చింది. ఉపాధి పనులతో కూలీ దక్కడమే కాకుండా భూములు బాగుచేసుకోవడానికి అవకాశం ఉందని తెలిసి రైతులకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. స్థానిక స్వచ్ఛంద సంస్థ రెడ్స్ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఈ గ్రామంలో అమలు పర్చేందుకు కృషి చేసింది. ముందుగా గ్రామ ప్రజలను సమీకరించి పథకంలో పేదలకు గల హక్కులను వివరించారు. గ్రామంలోని పేద రైతులు, వ్యవసాయ కూలీలు ముక్తకంఠంతో అడిగిన ప్రశ్న ఒకటే. 'ఈ పథకం ద్వారా పొలాలలోని రాళ్ళను ఏరుకోవచ్చా?! అన్నదే ఆ ప్రశ్న. రెడ్స్ సంస్థ ప్రతినిధులు ఉపాధి హామీ పథకం అధికారులతో చర్చలు జరిపారు. అధికారులకు, ప్రజలకు మధ్య ముఖాముఖి సమావేశాలను ఏర్పాటుచేశారు. వీటి ఫలితంగా ఉపాధి పనుల్లో భాగంగా పొలాలలోని రాళ్ళను ఏరి ఫిబెల్ బండింగ్స్ పెట్టుకోవడానికి అధికారులు అంగీకరించారు. భూమిపై పేరుకున్న రాళ్లు పోవడంతో పాటు భూసారాన్ని, నీటినిల్వను పెంచే కట్లుగా అవి ఉపకరిస్తాయని రైతులు తెలుసుకునే సరికి వారికి చాలా ఉత్సాహం వచ్చింది.

గ్రామంలో 2008 ఏప్రిల్ 19 నుండి జూన్ వరకు 42 రోజులు పనులు జరిగాయి. 125 కుటుంబాలకు చెందిన 170 మంది ఆయా పనులలో పాల్గొన్నారు. 275 ఎకరాలలోని రాళ్ళను ఏరివేసి కట్టలు కట్టారు. ఈ పని వల్ల మొత్తం 1713 రోజు పనిదినాలు ఏర్పడ్డాయి. మొత్తంగా 1,75,312 రూపాయలు వేతనంగా అందుకున్నారు. చేతికి వచ్చిన ఆదాయం ఆసరాగా నున్నగా కనిపిస్తున్న పొలంలో రైతులు వేరుశనగ పంటను పెట్టారు. జూన్ నెలకు ఉపాధి పనులు పూర్తయ్యి, డబ్బు చేతికి అందడం, అదే నెలలో వ్యవసాయ పనులు మొదలు కావడంతో ఈసారి పెట్టుబడి కోసం అప్పుల కోసం తిరిగే తిప్పలు తప్పాయి. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలు దిన ఖర్చులకు కొంత మొత్తం పోగా మిగిలిన డబ్బుతో గొర్రెలు, పొట్టేలు పిల్లలను కొనుక్కున్నారు. తమ కళ్ళ ముందు మారిన 275 ఎకరాల భూమి ఇతర రైతులకు స్ఫూర్తిగా నిలిచింది. ఈసారి తాము కూడా ఉపాధి పనుల్లో పాల్గొంటామని పలువురు పేద రైతులు ముందుకు వస్తున్నారు. ❑



## భూమి ఉపాధి హక్కుల వేదిక / సభ్యులు గత 2-3 నెలలలో నిర్వహించిన ముఖ్యమైన కార్యక్రమాలు



- కోనేరు రంగారావు కమిటీ నివేదికలోని ఆదివాసీ భూమి సమస్య సిఫార్సుల అమలు తీరుకు సంబంధించి వరంగల్, ఖమ్మం, తూర్పుగోదావరి ఏజన్సీ ప్రాంతాలలో భూమి ఉపాధి హక్కుల వేదిక సభ్యులు రూరల్ డెవలప్‌మెంట్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ వారి సహాయంతో అధ్యయనం చేసి నివేదికను రూపొందించారు. సెప్టెంబర్ 2 వ తారీఖున భూమి ఉపాధి హక్కుల వేదిక ప్రతినిధులు పిఎస్ అజయ్ కుమార్, జె.బాపూజీ, పి. శంకర్, దుర్గాప్రసాద్, సత్యంలు పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించి ఈ అధ్యయనంలోని ముఖ్యాంశాలను వెల్లడించారు. దీనికి సంబంధించి భూమి ఉపాధి హక్కుల తరపున కొన్ని డిమాండ్లు ప్రభుత్వం, ప్రజల ముందుంచారు. ఈ నివేదికను అందరు ఎస్‌టి శాసన సభ్యులకు, సంబంధిత మంత్రి, అధికారులకు, ఆదివాసీ సంఘాలకు పంపాలని నిర్ణయించారు.

- కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో 31 ఆగస్టు తేదీన (నెలలో ఆఖరి పని రోజు) దళిత బహుజన వనరుల కేంద్రం కార్యకర్త మధు రెవెన్యూ అధికారులతో పౌర హక్కుల దినోత్సవాన్ని జరిపించారు. ఆ గ్రామంలో ఉన్న ఎస్‌సి ఎస్‌టిలపై వివక్షకు సంబంధించిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

- సెప్టెంబర్ ఏడవ తేదీన దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో దళిత భూమి హక్కుల అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత భూమి హక్కుల దృక్పథంలో స్పష్టత తీసుకురావడం, హక్కుల సాధనకు, ప్రాంతాల వారీగా సమావేశాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు.

- కర్నూలు జిల్లాలో కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల అమలుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం చూపిన చొరవ, చేపట్టిన ప్రత్యేక చర్యలను అర్థం చేసుకోవడానికి ఆ జిల్లాను సందర్శించడం జరిగింది. వచ్చే నెలలో విస్తృత అధ్యయనం చేయాలని నిర్ణయించడం జరిగింది.

- జూలై 24, 25 తేదీలలో జరిగిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ల సమీక్షా సమావేశాల సందర్భంగా గ్రామీణాభివృద్ధి కమీషనర్, ముఖ్య కార్యదర్శిలకు ఉపాధి హామీ, ఇందిర ప్రభ పథకం అమలులో క్షేత్ర స్థాయిలో గమనించిన లోపాలు, వాటి సవరణకు తీసుకోవల్సిన చర్యలను సూచిస్తూ భూమి-ఉపాధి హక్కుల వేదిక ఒక నివేదికను అందించింది. ❑

Book Post

To

**భూమి కేంద్రం**

**వాసన్**
12-13-450, వీధి నెంబరు 1, తార్నాక
సికింద్రాబాదు - 500017
ఫోన్: 040-27015295/27015296.
Email: wassan@eth.net, Website: www.wassan.org

for private circulation only